క్లుప్తంగా

శ్రీమఠంలో కర్ణాటక మంత్రి



పీఠాధిపతి చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న మంత్రి రామలింగారెడ్డి

మంత్రాలయం : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రవాణ, ముజ్రాయ్ శాఖ మంత్రి రామలింగారెడ్డి మంగళవారం మంత్రాలయం విచ్చేశారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆయన మంత్రాలయం చేరుకుని స్వామి సేవలో తరించారు. ముందుగా ఆయన గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని పూజలు చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు చేతుల మీదుగా రాఘవేంద్రుల జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పూల మంత్రాక్షింతలు అందుకుని ఆశీర్వాదం పొందారు. స్థానిక సీఐ రామాంజులు నేతృత్వంలో ఆయన బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థుల్లో క్రమశిక్షణ అవసరం

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థుల్లో క్రమశిక్షణ అవసరమని, అప్పుడే చదువుల్లో రాణించి ఉన్నత శ్రేణులకు చేరుకోగలరని పట్టణ సీఐ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం పట్టణంలోని నారాయణ పాఠశాలలో ఏజీఎం రమేష్‌కుమార్ అధ్యక్షతన క్యాబిన్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు ప్రోత్సాహక మెడల్స్, సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఏఓ జాకీర్ హుసేన్, డీన్ గిరిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న మాచాని సోమనాథ్

ఎమ్మిగనూరుటౌన్: మాచాని సోమప్ప మెమోరియల్ ట్రస్ట్ ద్వారా విద్యాభివృద్ధికి తమ వంతుగా చేయూతనందిస్తామని ట్రస్ట్ నిర్వాహకులు మాచాని రఘునాథ్, మాచాని సోమనాథ్, మాచాని తారకేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మాచాని మెమోరియల్ హాల్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పదో తరగతి విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. రెండు వేల మంది విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం స్టడీ మెటీరియల్ అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు కేఎస్‌పీ శివన్న, లలిత్‌కుమార్, వీజీఆర్ కొండయ్య, కుర్ణిదైవాచార సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ముగతి సర్పంచ్‌కు సతీ వియోగం

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి భార్య ఆనందమ్మ(45) అనారోగ్యంతో మంగళవారం మృత్యువాత పడ్డారు. విష యం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకు లు, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, బుట్టా నీలకంఠ, బుట్టా ప్రతుల్ వేరు వేరుగా ఆనందమ్మ మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని నింపారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



దాతను సత్కరించిన నిర్వాహకులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉరుకుంద ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ చెన్నబసప్పధని రూ.లక్షను విరాళంగా అందజేశారు. సుమారు కోటి రూపాయలతో దేవాలయాన్ని శిలామండపాలతో నిర్మిస్తున్నారు. ఇందు కోసం భక్తులు ముందుకు రావాలని దేవాలయం నిర్వాహకులు కోరడంతో తన వంతుగా లక్ష రూపాయలను అందజేసినట్లు చెన్నబసప్ప తెలిపారు. దేవాలయం నిర్వాహకులు ఆయనను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు లింగారెడ్డి, జనార్దన్‌రెడ్డి, జట్లయ్య, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నందవరం: పాఠశాలల ఆవరణ, పరిసరాల్లో మత్తు పదార్థాలైన సిగరెట్లు, బీడీలు, గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ ఎం.కేశవ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని షాపులను పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో ఎస్‌ఐ తనిఖీ చేశారు. సిగరెట్లు, బీడీలు, గుట్కాలు విక్రయిస్తున్న 10 మంది బంకు యజమానులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున రూ.5,000 జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాల, ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయం శూన్యం

- కూటమి ప్రభుత్వంలో రైతన్నకు మొండిచెయ్యి
- అదును దాటిపోతున్నా అందని 'సుఖీభవ'
- గతంలో సకాలంలో భరోసా ఇచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- చిల్లిగవ్వ లేక అప్పుల కోసం అన్నదాతల పాట్లు



దుక్కి దున్నుతున్న రైతు

గోనెగండ్ల : అధికారంలోకి రావాలన్న తపనతో కూటమి నాయకులు అమలుకు సాధ్యం కాని హామీలు గుప్పించారు. పాలన పగ్గాలు చేపట్టిన తరువాత రైతు భరోసా పథకానికి అన్నదాత సుఖీభవగా పేరు మార్చారు. ఏడాది గడిచినా రైతులకు ఒక్క రూపాయి కూడా వేసిన దాఖలాలు లేవు. సంవత్సరానికి రూ.20వేలు సాయం చేస్తామని చెప్పి అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప.. పథకం అమలులో స్పష్టత కొరవడింది. ఖరీఫ్ పంటల సాగుకు కర్షకుల వద్ద సొమ్ములు లేక అప్పులు చేస్తున్నారు. కూటమి నాయకుల మాటలకు చేతలకు పొంతన ఉండడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో సకాలంలో రైతు భరోసా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ సాగు మొదలుకాక ముందే ఆర్థిక సహకారం అందజేయడంతో ఐదేళ్లపాటు వ్యవసాయం పండగలా సాగింది. నాడు ఏటా రైతులకు రూ.13,500 అందేది. కూటమి పెద్దలు ఎన్నికల ముందు రూ.20వేలు అందజేస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్నా.. ఇప్పటి వరకు కనీసం సాయం అందించకపోవడంతో ప్రస్తుతం పంటల సాగుకు పెట్టుబడికోసం చేతిలో చిల్లిగవ్వ లేక అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు.

అదిగో.. ఇదిగో.. అంటూ కాలయాపన

ఈ ఏడాది ముందస్తుగా కురిసిన వానలకు రైతులు ఖరీఫ్ ముందస్తు సాగుకు పూనుకున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 42,952 ఎకరాలకు గాను 21,992 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. పేరు మార్చిన అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయడంలో ప్రభుత్వానికి స్పష్టత కొరవడింది. ఏడాది నుంచి ఇస్తామని చెబుతున్నా నేటి వరకు విధి విధానాలు వెల్లడించకపోవడాన్ని చూస్తే పాలకుల చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థమవుతుంది. జూన్ 20వ తేదీన అని ఒకరు, కాదు 21వ తేదీన అని సీఎం చంద్రబాబు పలుమార్లు ప్రకటించినప్పటికీ జూలై 15వ తేదీ గడిచినా రైతుల ఖాతాల్లో పథకం సొమ్ము జమ కాలేదు. అసలు ఈ పథకం అమలు చేసే ఉద్దేశం ఉందా లేదా అన్న సమాచారం కూడా ప్రభుత్వం నుంచి రావడం లేదు. గతేడాది దిగుబడులకు మద్దతు ధర లభించకపోవడం, అంతంత మాత్రంగానే దిగుబడులు రావడంతో రైతుల చేతిలో చిల్లిగవ్వ లేక పంటల సాగుకు అప్పులు చేయాల్సి వస్తోంది.

కౌలు రైతులకు దక్కని భరోసా

భూమిలేని రైతులు కౌలుకు భూములను సాగు చేస్తున్న వారికి కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించింది. అయితే నేడు అవేవీ అమలు చేయకుండా రద్దు చేయడంతో కౌలు రైతులు పథకాలన్నింటికీ దూరమై గగ్గోలు పెడుతున్నారు.

ఇంకెప్పుడు ఇస్తారు ?



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే అన్నదాత సుఖీభవ పథకం నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. నేటి వరకు ఆ పథకం గురించి ప్రభుత్వం ఊసే ఎత్తడం లేదు. ఇప్పటికే ముందస్తు వర్షాలతో కొంతమంది రైతులు అప్పులు చేసి పంటలు సాగుచేసుకున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి నాయకులు ఇచ్చిన మాట ప్రకారం వెంటనే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలి.
– శ్రీనివాసులు, రైతు, గోనెగండ్ల

జూన్‌లోనే ఇస్తామన్నారు



అన్నదాత సుఖీభవ ఏడాది నుంచి ఇస్తామని చెప్పి నేటికి అమలు చేయలేదు. జూన్ 20వ తేదీ అన్నారు. లేదు మళ్లీ 21 అన్నారు. ఇంత వరకు ఇవ్వలేదు. ఎప్పుడిస్తారో స్పష్టత లేదు. గత ఏడాది ఇవ్వలేదు. ఈ ఏడాదైన ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసుకోవడానికి అమలు చేస్తారా లేదా అనే అనుమానం ఉంది. ఇప్పటికే కొంత మంది రైతులు అప్పులు చేసి పంటలు సాగుచేసుకున్నా. అప్పులు దొరకని రైతులు సుఖీభవ నగదు కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. పథకాన్ని వెంటనే అమలు చేయాలి. – దొరబాబు, రైతు, గోనెగండ్ల

ఇంటర్‌లో ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

కౌతాళం: ఇంటర్మీడియెట్‌లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం అర్హులైన బాలికలు దరఖాస్తు చేసుకోవాలని కౌతాళం కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పలత తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 2025–26 విద్య సంవత్సరానికి గాను మొదటి సంవత్సరంలో ఐదు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎంపీసీ గ్రూపు ఇంగ్లిష్ మీడియం చదువుకోవాలనుకున్న బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 2025–26కు గాను అడ్మిషన్లు పూర్తి అయ్యాయని తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో చేరాలనుకున్న వారు పాఠశాలలో సంప్రదించవచ్చన్నారు.

నిర్వాసితులతో సమావేశం

మంత్రాలయం రూరల్ : మంత్రాలయం పట్టణంలో రద్దీ దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి 167కు బైపాస్ రోడ్డు నిర్మించ తలపెట్టింది. కల్లుదేవకుంట గ్రామం నుంచి చెట్నెహళ్లి గ్రామాలను అనుసంధానం చేస్తూ బైపాస్ రోడ్డు వేయనున్నారు. అందుకుగానూ ప్రభుత్వం రైతుల నుంచి పొలాలను సేకరిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వాసిత రైతులతో తహసీల్దార్ రమాదేవి సమావేశం నిర్వహించారు. రహదారి నిర్మాణానికి 32.13 ఎకరాల భూమి అవసరం కానున్న నేపథ్యంలో రైతులతో అభిప్రాయాలు సేకరించారు. ప్రభుత్వం నిర్వాసితులకు చెల్లించనున్న పరిహారం వివరాలు వెల్లడించారు. రైతులు మార్కెట్ విలువకు సరితూగా పరిహారం ఇవ్వాలని కోరారు. త్వరలోనే బైపాస్ రోడ్డు భూసేకరణ పూర్తి చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

యువతకు పెద్ద పీట



ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కోసిగి: వైఎస్సార్‌సీపీలో యువతకు పెద్దపీట వేశామని, సామాన్య కార్యకర్తలకు నాయకత్వ బాధ్యతలు అప్పగించి సముచిత స్థానం కల్పించామని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. ఇటీవల పార్టీలో జిల్లా అనుబంధ విభాగంలో పదవులు దక్కిన కోసిగి మండలానికి చెందిన నాయకులు మంగళవారం ఎమ్మెల్యే స్వగ్రామం రాంపురంలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డిని కలిసి శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో సోషల్ మీడియా విభాగం జిల్లా కార్యదర్శి పి. లోకారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యులు సందిపోగు అయ్యప్ప, మండల యూత్ వింగ్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ (బుజ్జి), మండల బీసీ సెల్ అధ్యక్షుడు కట్టెల నరసింహులు, ఎంపీపీ ఈరన్న, పార్టీ మండల ఉపాధ్యక్షులు ముకుంద కృష్ణమూర్తి, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కాంట్రాక్టర్ నాగరాజు, వలంటీర్ విభాగం జిల్లా కార్యదర్శి అంజి, సాంస్కృతిక విభాగం జిల్లా కార్యవర్గ సభ్యులు కొరివి నాగరాజు, గూటెప్ప, ప్రవీణ్‌కుమార్, డొల్ల నరసింహులు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కోసిగి: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. జాతీయ కమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక పోస్టాఫీసు వద్ద నల్లబాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి జీడీఎస్ ఉద్యోగికి రూ.10లక్షలు గ్రాడ్యుటీ, రూ.5లక్షలు ఇన్సూరెన్స్ వర్తింప చేయాలన్నారు.రాష్ట్ర కోశాధికారి భాస్కర్ రెడ్డి, కర్నూలు రీజియన్ అధ్యక్షుడు ఆర్ఆర్ సుధాకర్, జిల్లా అధ్యక్షుడు మహబూబ్ బాషా పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం

ఆదోని టౌన్: క్షయ వ్యాధిని పూర్తి స్థాయిలో నిర్మూలిద్దామని డాక్టర్ అనిల్‌సాగర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని హనుమాన్‌నగర్ హెల్త్ సెంటర్ పరిధిలోని రాజేశ్వరినగర్‌లో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్ఓలకు శిక్షణ



మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి అనురాధ

కోసిగి: ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని మంత్రాలయం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి అనురాధ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో మండలంలోని బూత్ లెవెల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాలో తప్పులు లేకుండా సరిచేయాలన్నారు. అలాగే మరణించి వారి పేర్లు తొలగించాలని , వలస వెళ్లిన వారిని గుర్తించాలని సూచించారు. అలాగే 18 ఏళ్లు నిండి అర్హత కలిగి ఉన్న వారి పేర్లు ఓటరు జాబితాలో చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఏఎల్ఎంటీ కన్నడ రాజు, సూపర్ వైజర్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు పకడ్బందీగా చేపట్టండి

గోనెగండ్ల : ఓటర్ల నమోదు ప్రక్రియను బీఎల్ఓలు పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ రాజేశ్వరి సూచించారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్ల ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనం నందు బీఎల్ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ వలిబాషా, ట్రైనర్ కరుణాకర్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

నందవరం : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ కేశవ సూచించారు. మంగళవారం నాగలదిన్నె చెక్ పోస్టు వద్ద వాహనల తనిఖీ చేపట్టారు. అనంతరం వాహనదారులకు రహదారి నియామాలు– రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సరైన ధ్రువ పత్రాలు లేని 14 మంది వాహనదారులకు రూ.2,590 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లతో పాటు ఐరన్‌బండ, హెచ్. కైరవాడి తదితర గ్రామాల్లో అక్రమంగా విద్యుత్ వాడుతున్న ఇళ్లపై మంగళవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. కర్నూలు విజిలెన్స్ విభాగం డీఈ ప్రదీప్ ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో 60 మంది అక్రమంగా విద్యుత్ చౌర్యంకు పాల్పడినట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. రూ.1.20లక్షలు జరిమానా విధించారు. ఏడీఏ శోభన్ ప్రసాద్, ఏఈ చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా యువజన నైపుణ్యాల దినోత్సవం

ఆదోని సెంట్రల్: పట్టణంలో ఆర్ఆర్ లేబర్ కాలనీలోని పురపాలక ఉన్నత పాఠశాలలో ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం రవి, ఉపాధ్యాయులు రమేష్ నాయుడు, లోక్య నాయక్ ఒకేషనల్ ఉపాధ్యాయులు రామాంజినేయులు, భార్గవి ప్రియా మాట్లాడుతూ యువతకు ఉపాధి, మంచి పని వంటి వ్యవస్థలను సమకూర్చాలన్నారు. అయా రంగాల్లో నైపుణ్యాలను మెరుగు పరుచుకొనే విధంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ఒకేషనల్ ఉపాధ్యాయులు రామాంజినేయులు, భార్గవి ప్రియాలను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి. వీరచంద్ర యాదవ్, బి. శ్రీనివాసులు, నిర్మల, మహేశ్వరి, శ్రీరాములు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

నదీ తీరంలో బందోబస్తు



స్నానపుఘాట్‌లో హెచ్చరికలు చేస్తున్న సీఐ రామాంజులు

మంత్రాలయం రూరల్ : రాఘవేంద్రస్వామి దర్శనార్థం విచ్చేసిన కర్ణాటకలోని హాసన్ జిల్లా అర్సకేరి మండలానికి చెందిన ముగ్గురు యువకులు నదీ ప్రవాహంలో గల్లంతై మృతిచెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంత్రాలయం తుంగభద్ర నదీతీరంలో బందోబస్తు చర్యలు చేపట్టారు. నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సీఐ రామాంజులు నేతృత్వంలో ఎస్డీఆర్ఎఫ్ బృందం, మఠం సెక్యురిటీ గార్డ్స్‌తో పహారా ఏర్పాటు చేశారు. నదీ స్నానాలకు వెళ్లే భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాలకు స్నానాలకు వెళ్లకుండా కేటాయించిన ఘాట్లలోనే స్నానాలు చేయాలని సూచిస్తున్నారు.

ఫర్టిలైజర్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు



గోనెగండ్ల లక్ష్మీనరసింహస్వామి ట్రేడర్స్‌లో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎమ్మిగనూరుటౌన్/గోనెగండ్ల: పట్టణంలోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ డిమార్ట్‌మెంట్ ఏడీఏ ఒంగోలు రమేష్‌బాబు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నారాయణ, ఏఓ శివశంకర్ దాడులు నిర్వహించారు. శివసాయిట్రేడర్స్‌లో రూ.8,35,604 విలువగల పురుగు మందులను సీజ్ చేశారు. అలాగే త్రివేణి ఆగ్రో ఎంటర్‌ప్రైజెస్‌లో రూ.42.50లక్షల విలువగల ఎరువుల అమ్మకాలు నిలిపివేశారు. శ్రీరాజరాజేశ్వరీ ఫర్టిలైజర్స్ రూ.52,844 విలువగల ఎరువులు, మౌనిక ట్రేడర్స్‌లో రూ.2.5లక్షల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేశారు. అలాగే గోనెగండ్ల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ట్రేడర్స్‌లో బిల్లులు, పీసీలు ఇంక్లూషన్ చేయనందున రూ.8,20,879 విలువ చేసే పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు కడప జిల్లా విజిలెన్స్ సీఐ వెంకట రమణ, ఒంగోలు ఏడీఏ రమేష్ బాబు తెలిపారు. ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత, సిబ్బంది ఉన్నారు.

ఆదోని రూరల్: ఆదోని పట్టణం, మండలంలోని ఎరువులు, విత్తన దుకాణాలను మంగళవారం గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ఐ.సుదర్శనరాజు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ సబ్‌ఇన్‌స్పెక్టర్ వెంకటప్రసాద్, ఆదోని ఏడీఏ బాలవర్ధిరాజు, ఏఓ సుధాకర్లు తనిఖీలు చేపట్టారు. శ్రీ లక్ష్మీగణేష్ ఎంటర్‌ప్రైజెస్‌లో రూ.11,34,437 విలువ గల ఎరువులు, విత్తనాలను, వెంకటేశ్వర ఫర్టిలైజర్‌లో రూ.18,71,125, భువనేశ్వరి సీడ్స్‌లో రూ.1,76,300 విలువ గల ఎరువులు, విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు చెప్పారు.

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో ఫర్టిలైజర్ షాపులను ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ సుదర్శన్‌రాజు, ఆదోని ఏడీఏ బాలవర్ధిరాజు, ఏఓ శేషాద్రి తనిఖీ చేశారు. రాజా రాజేశ్వరి ట్రేడర్స్‌లో రూ14.17లక్షల స్టాక్, శివ కిరణ్ ట్రేడర్స్‌లో రూ 2.52లక్షల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు.

కోసిగి: కోసిగిలోని రాజరాజేశ్వరి ఫర్టిలైజర్స్ దుకాణంలో రూ.10.8లక్షల విలువగల ఎరువుల అమ్మకాలు నిలిపి వేసినట్లు గుంటూరు రాష్ట్ర వ్యవసాయ సహాయ సంచాలకులు సుదర్శన్ రాజు, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకట ప్రసాద్, ఆదోని ఏడీఏ బాలవర్ధిరాజు, కోసిగి ఏఓ వరప్రసాద్ తెలిపారు.

కరెంట్ కోతలు నిలిపివేయాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శివారు ప్రాంతాల్లో నిత్యం మరమ్మతుల పేరుతో విధించే కరెంట్ కోతలను నిలిపివేయాలని సీపీఎం నాయకులు రాముడు, కృష్ణలు కోరారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ కాలనీ సచివాలయ అడ్మిన్‌కు వినతి పత్రం ఇచ్చి మాట్లాడారు. ఎన్టీఆర్ కాలనీ, శివన్న నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను తరచూ నిలిపివేస్తుండటంతో చేనేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా జలసాధన సమితి కన్వీనర్ శేషాద్రి రెడ్డి

గోనెగండ్ల : పెండింగ్‌లో ఉన్న ఆర్‌డీఎస్ కుడికాలువ, గుండ్రేవుల, వేదవతి, పందికోన రిజర్వాయర్ పనులు త్వరితగతిన పూర్తి చేసి నీరు అందించాలని జిల్లా జలసాధన సమితి కన్వీనర్ శేషాద్రి రెడ్డి, మాజీ ఎంపీపీ కేవీ కృష్ణారెడ్డి, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకన్న, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కోఆర్డినేటర్ రామకృష్ణారెడ్డి, పందికోన రిజర్వాయర్ ఆయకట్టు సమితి కన్వీనర్ కాశీవిశ్వనాథ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్లలో రైతు సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రం రైతులకు ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన తరువాత పనులు చేపట్టడం లేదన్నారు. ప్రాజెక్టులపై రైతులకు అవగాహన కల్పించేందుకు గాను ఈనెల 20వ తేదీన ఆదోని పట్టణంలో రైతులతో రాయలసీమ సాధన సమితి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులందరూ ఈ సమావేశానికి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళీ నాయుడు, దొరబాబు, చికెన్ రాజా, నాయుడు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ టాప్‌తో విద్యుత్ ఆదా

ఆదోని అర్బన్: సోలార్ రూఫ్ టాప్‌తో విద్యుత్ బిల్లు ఆదా చేసుకోవడమే కాకుండా రాయితీ కూడా వస్తుందని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి తెలిపారు. ఈ విషయంపై విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఆదోని డివిజన్ విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. స్థానిక డీఈ కార్యాలయంలో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో లోఓల్టేజ్ సమస్య లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాంటి సమస్యలు లేకుండా వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. ఆదోని ఇన్‌చార్జ్ డీఈ పురుషోత్తం, జిల్లా ఎస్ఏఓ రాఘవ, ఏడీలు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలు పెంచాలి

నందవరం : పిల్లల విద్యా సామర్థ్యాలను పెంచాలని మండల విద్యాధికారి రామాంజనేయులు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మాచాపురం ఎస్సీ కాలనీలోని ఎంపీపీఎస్ పాఠశాలలో పిల్లల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు గుర్తించి వెలికి తీయాలన్నారు. వారికి అర్థమయ్యే విధంగా విద్య బోధన ఉండాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజనం పథకంలో మెనూ పాటించాలని వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు.





దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చొని ఉన్న భక్తులు , ఆలయం ముందు కిక్కిరిసిన భక్తులు (ఇన్‌సెట్) ప్రత్యేకాలంకరణలో రేణుకాయల్లమ్మవ్వ

వైభవంగా ఎల్లమ్మ గంప జాతర

ఆదోని అర్బన్: ఆషాఢమాసం మూడో మంగళవారం సందర్భంగా పట్టణంలో వెలసిన రేణుకాఎల్లమ్మవ్వ గంపజాతర ఉత్సవం ఘనంగా జరిగింది. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూల అలంకరణ, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు జరిగాయి. కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి మండపాల్లో రాత్రి బసచేసి పిండి వంటకాలు చేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా ఆదోని, ఆదోని చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు ఇంటి నుంచి పిండి వంటలు చేసుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి, కొండ ప్రాంతంలో చెట్లు, కొండల వద్ద సేదతీరుతూ పిండి వంటకాలను భుజించారు. డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్‌కు అంతరాయం, భక్తులు తోసుకోవడం లాంటి సంఘటనలు జరగకుండా పోలీస్ భారీ బందోబస్తు నిర్వహించారు.

తల్లికి వందనం వర్తింపజేయాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపాలిటీల్లో ఔట్‌సోర్సింగ్ కింద పని చేసే పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు తల్లికి వందనం వర్తింపజేయాలని ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మగురుడు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివకృష్ణ, ఎల్లప్ప డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం ఇచ్చారు.